

మురుగు కాలువల్లో పూడికతీత

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట మేజర్ గ్రామ పంచాయతీలో పరిధిలో పేరుకుపోయిన మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. బుధవారం ఎంపిడిఒ సుజాతమ్మ, పంచాయతీ కార్యాదర్శి సుధాకర్ పూడికతీత పనులను పరిశీలించారు. నీటి ట్యాంక్‌లో నింపిన నీరు శుభ్రతపై సచివాలయ వైద్య సిబ్బందితో డిపిడి క్లోరిన్ టాక్సెస్ టెస్ట్ చేసి నీటి శుభ్రతను పరిశీలించారు. అనంతరం నీటిలో బ్లీచింగ్ చల్లించారు. తుపాన్ కారణంగా కురిసిన వర్షానికి నీరు అపరిశుభ్రత కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రతి పంచాయతీలో సంబంధిత అధికారులు వాటర్ ట్యాంక్ చుట్టూ ఉన్న కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించమని ఎంపిడిఒ సుజాతమ్మ సిబ్బందిని ఆదేశించారు.

రాజంపేటకు న్యాయం చేసేనా!

- కొత్త జిల్లా ఏర్పాటుపై రాజంపేట వాసుల నిరీక్షణ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



రాష్ట్రంలోని కూటమి సర్కారు నూతన జిల్లాల ఏర్పాటుపై కసరత్తు చేస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తామని హామీనిచ్చింది. సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి సర్కారు అనంతరం రాష్ట్రంలోని 25 పార్లమెంట్ స్థానాల్ని జిల్లా కేంద్రాలుగా ఏర్పాటు చేయడానికి కసరత్తు చేసింది. రాజంపేట పార్లమెంట్ స్థానాన్ని మినహాయించి మిగిలిన 25 స్థానాలకు మరో గిరిజన జిల్లా ఏర్పాటును కలుపుకుని 26 జిల్లా కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లా కేంద్రాల ఏర్పాటులో రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించకపోవడంతోపాటు రాజంపేట అసెంబ్లీ పరిధిలోని ఒంటిమిట్ట, సిద్ధవటం, సుండుపల్లి, వీరబల్లి మండలాలను రెండు జిల్లాల పరిధిలోకి మార్చడం ద్వారా రాజంపేట ఉనికిని ప్రశ్నార్థం చేసింది. రాజంపేట వైసిపి మున్సిపల్ కార్పొరేటర్లు మొదలుకుని రాజంపేట వాసుల తీవ్ర నిరాశా నిస్పృహలకు లోనుకావడం తెలిసిందే. అప్పటి సిఎం పర్సనల్ సెక్రటరీ హోదా కలిగిన ఐఎఎస్, ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు ప్రజాప్రతినిధులు కూడబలుక్కుని రాజంపేటకు అన్యాయం చేయడం చర్చనీయాంశంగా మారింది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజంపేటను జిల్లా కేంద్రంగా మారుస్తామని ప్రకటించడం తెలిసిందే. రాష్ట్రంలోని కూటమి సర్కారు అశాస్త్రీయ ప్రతిపాదికన విభజించిన వివాదాస్పద జిల్లాల ఏర్పాటును సరిదిద్దడానికి ఉద్దేశించి మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఇటీవల మంత్రివర్గ ఉప సంఘం వివాదాస్పద జిల్లాల్లో పర్యటించింది. స్థానిక ప్రజల ఆశలను, ఆకాంక్షలను, జిల్లాల ఏర్పాటులోని అశాస్త్రీయతను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించనుంది. మంగళవారం మంత్రి వర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ నెల 30న మంత్రివర్గ ఉప సంఘం జిల్లాల విభజన అంశంపై మరోసారి సమావేశం కానుందనే వార్తలపై రాజంపేట పార్లమెంట్ ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. రాజంపేట జిల్లా కేంద్రం కావడానికి రోడ్డు, రైల్వే, ఎయిర్, పోర్ట్ వంటి సదుపాయాలు కలిగి ఉంది. కడప నుంచి చెన్నయ్ వెళ్లడానికి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి సదుపాయం దగ్గర నుంచి కడప, తిరుపతి ఎయిర్‌పోర్టులకు సమాన దూరంలో ఉండడం, కడప నుంచి చెన్నయ్ రైల్వే నెట్‌వర్క్‌ను కలిగి ఉండడంతో పాటు120 కిలోమీటర్ల పరిధిలో కృష్ణపట్నం పోర్టు సదుపాయాల్ని కలిగి ఉండడం ప్రత్యేక ప్రాధాన్యతలను సంతరించుకుని ఉందని పలువురు మేధావులు, ప్రముఖులు పేర్కొంటుండడం గమనార్హం. రాజంపేట పార్లమెంట్ స్థానానికి గల రోడ్డు, రైల్వే, ఎయిర్, ఓడరేవులువంటి భౌగోళిక సానుకూలతల ఆధారంగా రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ముంచిన మొంథా

- 11,403 ఎకరాల్లో పంట నష్టం
- కడపలో 10,813, అన్నమయ్యలో 590 ఎకరాలు



ఎర్రగుంట్ల : చిన్నదండ్లూరులో నేలకొరిగిన వరి పంట

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రైతుల ఆశలను మొంథా తుపాన్ ముంచేసింది. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలో 11,403 ఎకరాల్లోని పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశలో ఉన్న వరి, కంది, మినుములు, పెసర, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, పత్తి, నువ్వుల పంటలు ఉన్నాయి. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలో 26 మండలాల్లో 33 శాతం మేర దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ యంత్రాంగాలు ఎన్యూమరేషన్ చేశాయి. కడప జిల్లాలో 10,813 ఎకరాలు, అన్నమయ్య జిల్లాల్లో 590 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించి ప్రభుత్వానికి నివేదికను అందజేయనున్నట్లు తెలుస్తోంది.

కడప, అన్నమయ్య జిల్లాల్లోని 11,403 ఎకరాలకు నష్టం వాటిల్లింది. ఈ నెల 25 నుంచి ఆగ్నేయ బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, తాజాగా ఏర్పడిన మొంథా తుఫాన్ ధాటికి కడప జిల్లాలో 10,813 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 590 ఎకరాల్లోని పంటలు దెబ్బతిన్నాయి. ఈ లెక్కన 11,403 ఎకరాల్లో వరి, వేరుశనగ, మినుములు, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర, పత్తి, నువ్వుల రైతులు తీవ్రంగా నష్టపోయారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో జిల్లాలోని 3,235 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. దీంతోపాటు 175 ఎకరాల్లో వేరుశనగ, 6,350 ఎకరాల్లో మినుములు, 293 ఎకరాల్లో పెసర, 385 ఎకరాల్లో మొక్కజొన్న, కంది 167 ఎకరాలు, పత్తి 701 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. అన్నమయ్య జిల్లాకు చెందిన 432 మంది రైతులకు చెందిన 590 ఎకరాల విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయి. 575 ఎకరాల్లో వరి, 10 ఎకరాల్లో వేరుశనగ, మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లి ంది. కడప జిల్లాలో సగటున 50.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని బద్వేల్ నియోజకవర్గ పరిధిలో అత్యధిక వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బి.కోడూరులో 137 మి.మీ, కాశినాయనలో 128, పోరుమామిళ్లలో 127, కలసపాడులో 111.6, గోపవరంలో 111.2లో , బి.మఠంలో 89.6, బద్వేల్‌లో 81.6, అట్లూరులో 71.6, మైదుకూరులో 70.మి.మీ వర్షపాతం నమోదైంది. అన్నమయ్య జిల్లాలోని 30 మండలాల్లో ఒక మండలం మినహా మిగిలిన 29 మండలాల్లో 32.7 శాతం సగటు వర్షపాతం నమోదైంది.



గోపవరం : పూర్తిగా దెబ్బతిన్న వరి పంటను చూస్తున్న మహిళా రైతు

వర్ష బీభత్సం..వరి పైరుకు నష్టం

ఎర్రగుంట్ల: ఇటీవల కురిసిన వర్షాల వలన కోత దశలో ఉన్న వరి పంట వేలాది ఎకరాలు పూర్తిగా దెబ్బ తినడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 2350 ఎకరాల వరి పంటకు తీవ్ర నషం వాటిల్లింది. వరుసగా కురుస్తున్న అకాల వర్షాల వలన పంట పూర్తిగా దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. చిన్నదండ్లూరులో 1800 ఎకరాల వరి పంటలో 1500 ఎకరాల పంట దెబ్బతింది. ఇల్లూరులో 450 ఎకరాల వరి పంట పూర్తిగా దెబ్బతింది. గోపులాపురంలో 80 ఎకరాల పంట పూర్తిగా దెబ్బతింది. అకాల వర్షాల వలన 1300 ఎకరాల వరి దెబ్బతిందని ఎఒ సుజనకుమారి తెలిపారు. దెబ్బతిన్న పంటను రెండు, మూడు రోజుల్లో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు. కొంత మంది రైతులు పడిపోయిన వరిని మిషన్‌తో కోయిస్తామన్నారు. బురద ఉండడంతో కోత మిషన్‌కు బాడుగను రైతులు ఎక్కువ రేటు చెల్లించి వరి పంటను కోయించుకున్నారు.

యువత ఉద్యోగాలు అందించే స్థాయికి ఎదగాలి

- నీతి ఆయోగ్ జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ్ జైన్



స్టార్టప్ పనుల మ్యాపును పరిశీలిస్తున్న సిద్ధార్థ్ జైన్, కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-కడప

ఉద్యోగం అందుకునే స్థాయి నుండి ఉద్యోగాలు అందించే స్థాయికి యువత ఎదగాలన్న ప్రభుత్వ లక్ష్యం యువతకు స్ఫూర్తిదాయకమని నీతి ఆయోగ్ జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ జైన్ ప్రశంసించారు. బుధవారం కడప ఆర్ట్స్ కాలేజ్ సమీపంలో నిర్మాణంలో ఉన్న పి4 స్టార్టప్ కడప హబ్ సెంటర్ నిర్మాణ పనులను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరితోకలిసి సిద్దార్థ జైన్ పరిశీలించారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ ఆశించే స్థాయి నుండి శాశించే స్థాయికి ఎదగాలంటే ప్రతి ఇంటి నుండి ఒక స్టార్టప్ ఎదగాలనే ఆలోచన ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయన్నారు. ఇలాంటి స్టార్టప్ కార్యక్రమాన్ని ఆకాంక్ష జిల్లాలో ప్రప్రథమంగా ఏర్పాటు కావడం అభినందనీయన్నారు. అధునాతన సదుపాయాలతో అన్ని రకాల మౌలిక వసతులతో రూపుదిద్దుకోనున్న కడప స్టార్టప్ కేంద్రం యువ స్టార్టప్ వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థల అభివృద్ధికి పునాది వేస్తూ, కడపను వ్యాపార అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కీలక పాత్ర పోషించనుందన్నారు. కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో రూ.10 కోట్లు అంచనా వ్యయంతో స్టార్టప్ కడప సెంటర్ నిర్మాణం చేపట్టడం జరుగుతోందన్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన జిల్లా వాసుల సహకారంతో, వారిని అనుసంధానం చేసుకుని స్టార్టప్ కడప హబ్‌ను ముందుకు తీసుకువెళ్తామన్నారు. 25 వేలు చదరపు అడుగుల విస్తీర్ణంలో జి+3 అంతస్తులతో, పిఇబి టెక్నాలజీ ఆధారంగా ఈ భవన నిర్మాణం చేపడతున్నామన్నారు. షిర్డీసాయి ఎల్ట్రికల్స్ రూ.4 కోట్లు విరాళం అందించనుందన్నారు. స్టార్టప్ కడప కేవలం ఒక భవనం మాత్రమే కాదని ఇది యువత కలలకు రూపురేఖలు ఇచ్చే వేదికన్నారు. ఆవిష్కరణ, ఆధునికత, అభివృద్ధికి దిక్సూచిగా ఇది నిలవనుందన్నారు. కడపను పారిశ్రామిక, సాంకేతిక దిశలో ముందుకు నడిపించేందుకు ఇది ఒక మంచి విజ్ఞాన, ఉద్యోగ, ఉపాధి వనరుగా ఉపయోగపడనుందన్నారు. కడప జిల్లా ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరిచే దిశగా స్టార్టప్ కడప పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను బిల్డింగ్ నమూనా మ్యాపు ద్వారా క్షుణ్ణంగా అధికారికి వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజారత్నం, ఆకాంక్షిత జిల్లా నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, సంబందిత శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పురోగతి సాధించేందుకు కృషి చేయండి

ఆకాంక్షిత జిల్లాల ప్రగతిలో జిల్లా మరింత పురోగతి సాధించేందుకు సమిష్టి కృషితో ముందుకు వెళ్లాలని నీతి ఆయోగ్ జాయింట్ సెక్రటరీ సిద్ధార్ధ జైన్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని బోర్డ్ రూమ్‌లో కలెక్టర్ శ్రీధర్‌తో కలిసి ఆకాంక్షిత బ్లాక్ ప్రోగ్రాం ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి నాటికి 73.6 స్కోరు సాధించి టాప్ 5 జిల్లాలలో కడప జిల్లా నిలిచిందని తెలిపారు. ప్రతి అధికారి వారి అనుభవంతో వినూత్న పద్ధతులతో శాఖల ప్రగతికి పని చేయాలన్నారు. కలెక్టర్ శ్రీధర్ నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో మరింత పురోగతి సాధనకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో సమావేశంలో సిపిఒ హాజరతయ్య, డిఇఒ షంషుద్దీన్, డిఆర్‌డిఎ పీడీ రాజ్యలక్ష్మి, హౌసింగ్ పీడీ రాజా రత్నం, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

స్మార్ట్ కిచెన్ విధానం ఆదర్శనీయం

చింతకొమ్మదిన్నె : సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ నిర్వహణ అద్భుతంగా ఉందని నీతి అయోగ్ జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ్ జైన్, కలెక్టర్ శ్రీధర్ అన్నారు. స్థానిక జడ్‌పి హైస్కూలులోని సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ కిచెన్ షెడ్ నిర్వహణ గురించి ప్రొబెరీ అధికారికి వివరిస్తూ దేశంలోనే తొలిసారిగా సికె దిన్నె ఎంపిపి పాఠశాల ఆవరణలో రూ.56 లక్షలతో ఏర్పాటు చేశామన్నారు. 33 పాఠశాలల్లోని 1758 మంది విద్యార్థులకు శుచికరమైన రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎడిపి నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, విద్యాశాఖ ఆర్జెడి శామ్యూల్, డిఇఒ షంశుద్దీన్, హౌసింగ్ పీడీ రాజరత్నం పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-కడప అర్బన్



వాహనాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

నగరంలో లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. బుధవారం 48వ డివిజన్‌లో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మహిళా ప్రాంగణంలో లబ్ధిదారులకు ఇవ్వకుండా తుప్పు పట్టిన వాహనాలను సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూజిల్లాలో చెత్త సేకరణకు మినీ ట్రాక్టర్లు, గూడ్స్ ఆటోలు, పూడిక తీత యంత్రాలు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులకు అందించాల్సిన స్వయం ఉపాధి పథకాలు యూనిట్లు ఆరేళ్లుగా వందలాది వాహనాలు తుప్పుపట్టి రూ.25 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం సబ్సిడీ మంజూరు చేయలేదని, నిరుద్యోగులకు మొండిచేయి చూపుతున్న అధికారులకు తప్పుపడుతున్న యంత్రాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం గ్రామాల్లో, మున్సిపల్ పరిధిలో క్లీనింగ్ కోసం 2018-19 ఎస్సీ ఆర్థిక సంస్థ నుంచి జిల్లాకు ఆటోలు, ట్రాక్టర్లు, క్లీనింగ్ మిషన్లు కోసం రూ.25 కోట్లకుపైగా కొనుగోలు చేశారని పేర్కొన్నారు. లబ్ధిదారులకు ఇచ్చే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో వాటిని లబ్ధిదారులకు ఇవ్వకుండా పక్కన పెట్టారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లబ్ధిదారులకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడంతో వాహనాలు తుప్పుపట్టాయని తెలిపారు. ఈ అంశంపై ఇటీవల శాసనసభ సమావేశాల్లో కడప ఎమ్మెల్యే మాట్లాడినా ఏమాత్రం ఫలితం లేదన్నారు. కళ్ళముందే రూ.కోట్లు విలువైన యంత్రాలు తుప్పుగా మారుతూ ఉంటే అధికారులకు ఏమాత్రం చలనం లేదని ధ్వజమెత్తారు. వాహనాలను తుప్పు పట్టడానికి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులను కలుపుకుని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్నీ ముట్టడిస్తామని హెచ్చరించారు. పర్యటన సిపిఎం నాయకులు దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ, వెంకటరమణ పాల్గొన్నారు.



ఉల్లి పంటను పరిశీలిస్తున్న విశ్వనాథరెడ్డి

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : వైసిపి

ప్రజాశక్తి-కాశినాయన

తుపాన్ వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే ప్రభుత్వం ఆర్థిక సహాయం ఆదుకోవాలని వైసిపి నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాధరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చిన్నాయపల్లె, కోడిగుడ్లపాడు గ్రామాల్లో నష్టపోయిన ఉల్లి రైతులను కలిసి వారి బాధలను స్వయంగా పరిశీలించి పరిస్థితులను తెలుసుకున్నారు. వర్షంతో నీటమునిగిన ఉల్లి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షంతో వేల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందన్నారు. రైతులు రూ.లక్షల్లో అప్పులు చేసి పంటలు వేసుకున్నారని తెలిపారు. వర్షంతో పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జగన్ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నేరుగా ఇన్సూరెన్స్ చెల్లించేవారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో గంగనపల్లె సర్పంచ్ బసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రైతులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు

కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - బద్వేలు

పట్టణంలోని రూపారాంపేట, మొండివాడ కాలనీల్లో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జకరయ్య అన్నారు. బుధవారం వారు ఆయా కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూపరంపేట, మొండివాడలో నివాసం ఉన్న దాదాపు 40 కుటుంబాలు 60 ఏళ్ల నుండి అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. ఇంటి, నీటి పన్ను, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నా వారి సమస్యలు పరిష్కరించే నాధుడు లేడని ఆవేదన వ్యక్తం చేశారు. 20 కుటుంబాల ఇళ్లలు చిన్నపాటి వర్షానికి కారుతున్నాయని, వానాకాలం వస్తే వారు అనేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించి ఇండ్లకు ఇంటి పట్టాలతో పాటు పక్కా గృహాలు మంజూరు చేయించాలని కోరుతున్నామన్నారు. అధికారులు స్పందించి పట్టాల మంజూరు చేయకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పేద ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు కె.బాబు, కె.శివ, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ ఆదిల్, పట్టణ ఉపాధ్యక్షులు యువరాజ్, సురేష్, సహాయ కార్యదర్శి సుధాకర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రౌడీ షీటర్ల కదలికలపై నిఘా : ఎస్‌పి

ప్రజాశక్తి-జమ్మలమడుగు: సబ్ డివిజన్ పరిధిలో మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జమ్మలమడుగు అర్బన్ పోలీసుస్టేషన్‌లో సబ్ డివిజన్‌లోని సిఐలు, ఎస్ఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రమైన కేసుల గురించి ఆరా తీశారు. సబ్ డివిజన్ పరిధిలోని జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని, రాత్రి పూట నేరాలు జరగకుండా గస్తీ పెంచాలని సూచించారు. సమావేశంలో డిఎస్‌పి కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా యూనిట్ లీడర్‌కు ఉత్తమ పురస్కారం

ప్రజాశక్తి-కడప అర్బన్: భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ కార్యాలయం వారు రోబోటిక్స్, ఎఐ, స్టెమ్, యుఇపిపై జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను కర్ణాటక రాష్ట్రంలోని దక్షిణ కన్నడ జిల్లాలో ఆళ్వాస్ విద్యా సంస్థ వారం రోజుల పాటు ఏర్పాటు చేశారు. దేశ స్థాయి అన్ని రాష్ట్రాల నుంచి యూనిట్ లీడర్స్, రోవర్స్, రేంజర్ పాల్గొని వివిధ అంశాలపై పోటీ పడ్డారు. కడప జిల్లా నుంచి యూనిట్ లీడర్ అహమ్మద్ పాల్గొని దేశ వ్యాప్తంగా పోటీ పడి చక్కటి ప్రతిభ చూపించి విజయం సాధించిన జాతీయ కార్యాలయ గౌరవ అతిథులు మధుసూదన్, షిండీయ, ఎల్‌ఒసి అనలేంద్ర శర్మ, కృష్ణ స్వామి, ప్రతీమ కుమార్, ఛటర్జీ, భారత్ రాజ్, దక్షిణ కన్నడ జిల్లా ఎంపీ కెప్టెన్ బ్రిజేష్ చౌటా, ఆళ్వాస్ సంస్థల అధినేత మోహన్ ఆళ్వా, వివేక్ ఆళ్వా, రాష్ట్ర ఎస్ఒసి ప్రభాకర్ భట్టు చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అందుకున్నారు. వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం రాష్ట్ర కంటిన్జెంట్ లీడర్ అవార్డ్, బహుమతిని ముఖ్య అతిథుల చేతుల మీద అందుకున్నారు.

'ఆదినిమ్మాయపల్లె'ను సందర్శించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-వల్లూరు: తుపాన్ ప్రభావంతో వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల పరిధిలోని ఆదినిమ్మాయపల్లి ఆనకట్టను కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్ బుధవారం పరిశీలించారు. ఆనకట్టు ప్రస్తుత నీటిమట్టం, గేట్ల స్థితి, నిర్వహణ చర్యల గురించి విధి నిర్వహణలో ఉన్న అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీవాణి, పంచాయతీ కార్యదర్శి స్వప్న పాల్గొన్నారు.

వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-కాశినాయన: మండల పరిధిలోని సావిశెట్టిపల్లె దళితవాడలో మాల మహానాడు ఆధ్వర్యంలో వరదలో ఇబ్బంది పడ్డ దళితులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సావిశెట్టిపల్లె దళితవాడలో 40 కుటుంబాలు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన మట్టిమిద్దెలలో నివాసం ఉంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మోటపోతుల యవాను, జిల్లా ఉపాధ్యక్షులు బేరి అహరోణ్, మోటపోతుల విజయరాజు, వరకుమార్, రవి, జార్జి, రాజు సల్మన్‌రాజు, అభిషేక్ పాల్గొన్నారు.

చెరువులను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గోపవరం

మండలంలోని సండ్రపల్లి, సంగసముద్రం చెరువులను మాజీ ఎమ్మెల్యే విజయమ్మ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు ఆర్‌డిఒ చంద్రమోహన్, ఎంఎస్ఒ, ఇరిగేషన్ డిఇఇ, తహశీల్దార్ త్రిభువన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం విజయమ్మ మాట్లాడుతూ చెరువుల్లో నీటి మట్టం పెరుగుతున్నందున చెరువు తెగిపోకుండా తగిన జాగ్రత్త చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, బద్వేల్ మున్సిపాలిటీ టిడిపి అధ్యక్షుడు గుర్రంపాటి వెంగల్‌రెడ్డి, గోపవరం టిడిపి మండల అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, గోపవరం సొసైటీ అధ్యక్షుడు టెంకాయల నాయుడు, వైస్ ఎంపిపి రామ్మోహన్‌రెడ్డి, మల్లెంకొండ దేవస్థానం చైర్మన్ మల్లెం కొండయ్య, రామసుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి, సాలువ ఆదామ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కలసపాడు : మండలంలోని పిడుగుపల్లె, అక్కసిద్ధపల్లె, పెండ్లిమర్రి చెరువులను ఎగువ సగిలేరు నీటి సంఘం అధ్యక్షులు కొత్తపల్లి చిన్నరంగారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు నిండి అలుగులు పొర్లుతూ చెరువుల కట్టలను ముంచేత్తో దిశగా వరదనీరు వస్తుందని తెలిపారు. చెరువులకు మరమ్మతులు చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలుగుగంగ అధికారులను కోరారు. కార్యక్రమంలో పిడుగుపల్లె చెరువు టిసి కృష్ణారెడ్డి, రితీష్‌రెడ్డి యువసేన నాయకులు గోడి వినోద్‌రెడ్డి, తుపాకుల నాగయ్య, నాగార్జున, గుడిమే వెంగయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

బ్రహ్మంగారిమఠం ఎంపిపి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణను సస్పెండ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఆయన అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడన్నారు. బాలికలు పైన అసభ్యకరంగా ప్రవర్తించడం చాలా రోజులుగా జరుగుతుందన్నారు.విద్యార్థినులు విద్యకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్, కలెక్టర్, డిఇఒ ఉపాధ్యాయుడిపై విచారణ చేపట్టి సస్పెండ్ చేయాలన్నారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో నాయకులు జయంత్, గురప్ప పాల్గొన్నారు. **కడప అర్బన్ :** విద్యార్థినిలతో అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవడంలో జిల్లా విద్యాశాఖ అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ప్రశ్నించారు. విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన వెలుగుచూసి ఐదు రోజులు గడిచిన ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఇబ్బందులు రాకుండా చూడండి

ప్రజాశక్తి-కడప అర్బన్: నగరంలోని అప్సర సర్కిల్ పరిసర ప్రాంతాల్లో వర్షాల కారణంగా ప్రజలు ఎదుర్కొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం చేపట్టిన పనులను టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. బుగ్గవంక ప్రాంతంలోని షామీరియా బ్రిడ్జ్, జువెనైల్ హోమ్ సమీప ప్రాంతాల్లో వర్షపు నీటి ప్రవాహ పరిస్థితిని ప్రత్యక్షంగా వీక్షించారు. వర్షాల సమయంలో నీరు నిలిచిపోకుండా డ్రెయినేజీ వ్యవస్థను బలోపేతం చేసే పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం పనుల వల్ల నీటి నిల్వలు తొలగి, ప్రజలకు ఇబ్బందులు తగ్గుతున్నాయని అధికారులతో చర్చించారు. పనులను సమర్థంగా నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బందిని అభినందించి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇటీవలి వర్షాలతో ఎదురైన ఇబ్బందులు పునరావృతం కాకుండా, కడప నగరంలో నీటి పారుదల వ్యవస్థను పూర్తిగా మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం పనుల వల్ల నీటి ప్రవాహం సజావుగా కొనసాగుతూ, ప్రజలకు ఇబ్బందులు తగ్గుతున్నాయని పేర్కొన్నారు.

కూలిన వీరబ్రహ్మేంద్రస్వామి నివాస గృహం

ప్రజాశక్తి-బ్రహ్మంగారిమఠం: భారీ వర్షాలకు గజత్ శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి నివాస గృహం మంగళవారం రాత్రి కుప్పకూలింది. కందిమల్లయ్యపల్లె గ్రామంలో నివాసమున్న ఇల్లు దక్షిణ వైపు గోడ కూలింది. స్వామివారు నివాసమున్న బోధ కొట్టం స్థానంలో 1979, 1982లో స్వామి వారి ముగ్గురు భక్తులు స్వామివారి నివాసమున్న బోధకోటం స్థానంలో గదులు, వరండాను రాతి కట్టకంతో నిర్మించారు. మఠం యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల వర్షాలకు కూలిపోవడం పట్లఅధికారులు, మఠం యాజమాన్యం నిర్లక్ష్యం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. మఠానికి రూ.కోట్ల లాభాలు వస్తున్నప్పటికీ వాటి ఆదాయాన్ని తింటున్నారే తప్ప స్వామివారి నివాస గృహాన్ని కనీసం పట్టించుకున్న పరిస్థితులు లేవు. స్వామివారి నివాస గృహాన్ని పట్టించుకోకపోవడం వలన కూలిపోయింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బ్రహ్మంగారి స్వామి భక్తులు కోరుకుంటున్నారు. సంవత్సరంకుపైగా స్వామివారి నివాస గృహం లోపలికి ప్రజలకు అనుమతించకుండా అధికారులు శిథిలావస్థలో ఉందని చెబుతున్నారు తప్ప వాటిని పట్టించుకున్న పాపానపోలేదు. భక్తుల దగ్గర నుండి టోకెన్ రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నారు తప్ప కనీసం మరమ్మతులు కూడా చేయించకపోవడం చాలా బాధాకరమైన విషయమని స్వామివారి భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కూలిన బ్రహ్మంగారి నివాసం ఉన్న దక్షిణ వైపు గోడ



నీటిని పరీక్షిస్తున్న ఎంపిడిఒ రాధాకృష్ణవేణి

సురక్షిత నీటి సరఫరాకు కృషి

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు కృషి చేయాలని ఎంపిడిఒ రాధాకృష్ణవేణి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో బుధవారం ఆమె పర్యటించారు. నల్లబల్లెలో ఉన్న వాటర్ ట్యాంకులను బుధవారం ఎంపిడిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాటర్ ట్యాంకులు ద్వారా ప్రజలకు సురక్షితమైన నీరు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. శానిటేషన్‌లో భాగంగా గ్రామ పంచాయతీల్లోని వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేసి శుభ్రం చేయించామన్నారు. నీటిని పరీక్షించి ప్రజలకు స్వచ్ఛమైన నీరు సరఫరా చేసినట్లు తెలిపారు. కార్యదర్శులు గ్రామ పంచాయతీలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ హరీష్, సిబ్బంది, నాయకులు రామారెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలని వినతి

ప్రజాశక్తి - వేంపల్లె



వినతిపత్రమిస్తున్న చలపతి

ఇడుపులపాయ పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్యను తీర్చా లని జనసేన నేత పోతిరెడ్డి చలపతి కోరారు. ఆ మేరకు బుధవారం ఎంపిడిఒ కుళాయమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఇడుపులపాయ గ్రామ సమీపంలోనే పాపాగ్ని నది ప్రవహిస్తున్నప్పటికీ తాగునీటి ఇబ్బందులు తప్పడంలేదన్నారు. రెండు రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మారుతీ నగర్‌లో పైపులైను లీకే జీలున్నాయన్నారు. వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. ఇడు పులపాయ గ్రామ పంచాయతీలో వీధిలైట్లు కూడా వెలగడం లేద న్నారు. వర్ష కాలంలో వీధిలైట్లు లేకపోతే విష పురుగులు సంచరించే ప్రమాదం ఉందన్నారు. వెంటనే వీధి లైట్లు వేయించాలన్నారు. సమస్యల పరిష్కారానికి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలివ్వాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన మారుతి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

రెడ్ల మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ప్రజాశక్తి - ఖాజీపేట



జంగా శ్వేతారెడ్డి

రాష్ట్రంలోని రెడ్ల మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఖాజీపేటకు చెందిన భారత రెడ్డి సంఘం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జంగా శ్వేతారెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా బుధవారం ఆమె మాట్లాడుతూ అఖిల భారత రెడ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారుపల్లి జగన్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురుకూటి రాంభూపాల్ రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పొన్నపురెడ్డి శకుంతలరెడ్డి తన ఎంపికకు ఎంతగానో సహకరించారని, వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని రెడ్ల మహిళల రక్షణ కోసం పాటుపడతానన్నారు. రెడ్ల ఐక్యతను చాటి చెప్పేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రూ.10 కోట్లు పోగొట్టుకున్న ప్రొద్దుటూరు వాసులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ బంగారురెడ్డి

క్యాషినో అనే మోసంతో కూడిన జూదాన్ని ఆడేందుకు ప్రొద్దుటూరు నుంచి 352 మంది గోవా వెళ్లి రూ.10 కోట్లు పోగొట్టుకున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారురెడ్డి ఆరో పించారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపికి చెందిన బస్సు మురళి, నల్లబోతుల నాగరాజు ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు నుంచి వెళ్లి ఈ జూదంలో డబ్బులు పోగొట్టుకున్నట్లు తెలిపారు. వీరు ఈనెల 23, 24,25 తేదీల్లో గోవా వెళ్లారని పేర్కొన్నారు. ఇలాంటి ఆర్గనైజెడ్ జూదం ప్రొద్దుటూరు చరిత్రలో ఇది మొదటిసారి అన్నారు. ఇందుకు సంబంధించి తన వద్ద అన్ని ఆధారాలున్నాయన్నారు. అక్కడికి వెళ్లిన వారిని ఏడు లాడ్జిల్లో ఉంచి, వ్యవహారం నడిపా రన్నారు. ఒక డెక్‌లో కార్డులు పెట్టి ఎవరికీ తెలియకుండా పైనుంచి స్కాన్ చేస్తూ మోసం చేస్తారని ఆరోపించారు. ప్రొద్దుటూరు, జమ్మ లమడుగు, పులివెందుల, కడప నుంచి వెళ్లారని తెలిపారు. ఎస్‌పి వీరిపై చర్యలు తీసుకుని, పోగొ ట్టుకున్న రూ. 10కోట్లను తిరిగి ఇప్పించాలని బంగారురెడ్డి కోరారు. సుద్దులు చెప్పే ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఈ విషయాన్ని గమనించాలన్నారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు పట్టణ పరిధిలోని ప్రధాన రహదారుల వెంట వర్షపు నీరు పారుతూ చెరువులను తలపిస్తున్నాయి. వర్షం నీరు ప్రవహించేందుకు కాలువలు లేకపోవడంతో నీరు పూర్తిగా రోడ్లపై నిలుస్తోంది. ముఖ్యంగా కడప-కర్నూలు హైవేకు సంబంధించిన బ్రిడ్జిల కింద నీరు అధికంగా నిలుస్తున్నది. నంద్యాల రోడ్‌లోని ఆనుకుంటలో చెరువు అలుగు అధికంగా ప్రవహిస్తుండంతో వర్షపు నీరు పూర్తిగా రోడ్ల వెంబడి పారుతోంది. ప్రజలు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పట్టణంలో లోతట్టు ప్రాంతాలైన సుందరయ్య కాలనీ, వీణ విజయరామరాజు కాలనీ, చౌడేశ్వరి నగర్‌లో నీరు ఎక్కువగా నిలుస్తోంది. కడప రోడ్డులో ప్రధాన రహదారి వెంబడి నీరు ప్రవహిస్తూ బస్టాండ్ ప్రాంతంలోకి చేరుతోంది. గడ్డమాయపల్లి వద్ద చెరువు నీరు అధికంగా పారుతోంది. మొంథా తుపాన్ ప్రభావం పూర్తిగా తగ్గిన తర్వాత కూడా అధికారులు బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, వర్షపు నీటిని తొలగించే ప్రయత్నం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శుభ్రతకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఆనకుంటలో రోడ్డుమీద ప్రవహిస్తున్న వర్షం నీరు

గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి : డిపిఒ



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేకదృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఆమె పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్వే అసిస్టెంట్లుతో స్వామిత్వపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ వర్షాల కారణంగా గ్రామాల్లో నీరు నిల్వ ఉండి దోమలు అధికమై ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ సిబ్బంది చెత్త సేకరణ పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిపిఒ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసులరెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ వెంకటరాముడు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు హర్షణీయం : డిఎస్‌పి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మైదుకూరు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారక్షణలో భాగంగా నిత్యం బిజీగా ఉండే సిబ్బందితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారిని కాపాడే అవకాశం ఉంటుందన్నారు. యువత కూడా స్వచ్ఛందంగా రక్తదానంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇప్పటికే సిబ్బంది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారన్నారు. పోలీసుల త్యాగాలను ప్రజలు గుర్తించాలన్నారు. ప్రొద్దుటూరు బ్లడ్ బ్యాంకు వారి ఆధ్వర్యంలో సిబ్బంది రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. అర్బన్ సీఐ రమణారెడ్డి, రూరల్ సీఐ శివశంకర్ యాదవ్, ఖాజీపేట సిఐ వంశీధర్, బద్వేల్ అర్బన్ సిఐ లింగప్ప, రూరల్ సీఐ కృష్ణయ్య, ఎస్ఐ చిరంజీవి రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి జ్యోష్న, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ యాపరాల చిన్న, ఎస్ఐ సుబ్బారావు, ఏఎస్ఐ రాంభూపాల్ రెడ్డి, సబ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.



డిఎస్‌పి ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న పోలీస్ సిబ్బంది



నీట మునిగిన వరిపంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మొంథా తుపాను కారణంగా నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, సోమిరెడ్డి పల్లె దగ్గర బ్రిడ్జి ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలలో పడిపోయిన పంట పొలాలను, సోమిరెడ్డిపల్లి దగ్గర వాగును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వరి, మొక్కజొన్న, అరటి రైతులు తుపానుతో భారీగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. వరి పంట నీట మునిగి మోసులు వచ్చిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందారు. లింగాలదిన్నెపల్లి దగ్గర కోతకు వచ్చిన అరటి తోట నేలవాలిందన్నారు. మద్దిరెడ్డిపల్లి దగ్గర మొక్కజొన్న తోటలో నాలుగు అడుగులమేర నీరు నిల్వ ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్, మండల కమిటీ సభ్యులు సానా గోవిందస్వామి, రెబ్బ నర్సింహులు, అజయ్‌కుమార్, నాయకులు రాహుల్, అరవింద్ పాల్గొన్నారు.

తుపానుతో రైతులకు తీవ్ర నష్టం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మొంథా తుపాను కారణంగా ప్రొద్దుటూరు నియోజకవర్గ రైతులు పూర్తిగా నష్టపోయారని, ప్రభుత్వమే వారిని ఆదుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ రైతులు పొలాల్లో సత్తువ ఎత్తి విత్తనం కోసం ఎదురు చూస్తున్న తరుణంలో మొంథా తుపాను ధాటికి తీవ్ర నష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. చాలా ప్రాంతాల్లో పత్తి, కంది, మినుము, వరి పంటలు నీట మునిగాయని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి రైతులను ఆర్థికంగా ఆదుకొని రెండో పంట వేసేందుకు రైతుల్లో మనోధైర్యం నింపాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ కౌన్సిలర్ వెంకట కొండయ్య, టిడిపి నాయకులు ఘంటసాల వెంకటేశ్వర్లు, ఆవుల రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పిబిసి జలాశయం గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి - లింగాల

మొంథా వర్ష ప్రభావంతో పిబిసి జలాశయానికి భారీగా నీరు చేరింది. ఈ నేపథ్యంలో జలాశయం గేట్లును బుధవారం హైలెవల్ కెనాల్ ఛైర్మన్ జోగిరెడ్డి ఎత్తి నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 10 టిఎంసి సామర్థ్యం ఉన్న పిబిసి జలాశయంలోకి వర్ష ప్రభావం వల్ల ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు చేరడంతో 9.2 టిఎంసి మేరకు నీరు నిల్వ ఉందన్నారు. జలాశయం సామర్థ్యానికి సమాంతరంగా నీరు నిల్వ ఉంచడం వల్ల ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇందుకు 2 క్యూసెకుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. లోతట్టు ప్రాంతాల వాసులు ముంపునకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ ఏడాది లక్ష యాభై వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్ర మంలో ఆర్డీవో చిన్నయ్య, పిబిసి ఇఇ కిరణ్, మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డు ఛైర్మన్ అమరనాథ్, పార్నపల్లె ధనుంజయ నాయుడు, సోసైటీ అధ్యక్షుడు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

20 రోజులుగా నీరు రాక అవస్థలు

- వీధి కుళాయిలకు నీరు వదలండి సారూ..!

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు పాతవీధిలో 20 రోజులుగా వీధి కుళాయిలకు నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మేజర్ గ్రామ పంచాయతీ సచివాలయంలో బుధవారం డిప్యూటీ ఎంపిడిఒ వీరభద్రుడు, పంచాయతీ అధి కారులను కలిసి మహిళలు సమస్యను వివరించారు. పాత వీధిలోని 30 ఇళ్లకు 20 రోజులుగా వీధి కుళాయి లకు నీరు రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. నీరు రాక అష్టకష్టాలు పడుతున్నామని తెలిపారు. పాడిపశువులు, జీవాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, నీరు లేక అవి అలమటిస్తున్నాయని వాపోయారు. స్పం దించిన డిప్యూటీ ఎంపిడిఒ వీరభద్రుడు మాట్లాడుతూ ఏడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. అంత వరకూ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని తెలిపారు.

మురుగు కాలువల్లో పూడికతీత చేపట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని వైసీపీ నేత పద్మా రాజ్‌కుమార్ కోరారు. బుధవారం వేంపల్లెలోని పాత బాలికల పాఠశాల సమీపంలో ఉన్న మురుగు కాలువలను ఆ ప్రాంత ప్రజలతో కలిసి ఆయన పరిశీలించారు. కాలువల్లో పూడిక తీయక వర్షపు నీరు రోడ్లపై పారుతోందన్నారు. ప్రతి రోజూ 3వ సచివాలయం పరిధిలో కాలువలను శుభ్రం చేయాలని కోరారు. అంగన్వాడీ కేంద్రం వద్ద ఉన్న కాలువలోని పూడికను తీసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన పంచాయతీ అధికారులను కోరారు.

చేనేత కార్మికులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు



మాట్లాడుతున్న శివ నారాయణ

తుపాను కారణంగా పనులు లేక నష్టపోయిన చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ కోరారు. ఎపి చేనేత కార్మిక మండలశాఖ సమావేశాన్ని స్థానిక ఎన్జీవో కార్యాలయంలో నిర్వహిం చారు. ఈ సంద ర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ మొంథా తుపాను వల్ల ప్రజలు, రైతులు సత మతమవుతూ నష్టపోయారన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎక్కు వ మంది మగ్గాలు మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. వర్షాలతో పనుల్లేక సరుకు రాక, ఎగుమతి కాక చేనేతలు తీవ్ర ఇబ్బం దులకు గురవు తున్నారని తెలిపారు. అధికారులు చేనేత కాలనీల్లో పర్యటించి నష్టపోయిన వారికి ప్రభుత్వం నుండి సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు కొండయ్య, సంజీవ రాయుడు, గొరిగే కృష్ణ, లక్ష్మీనారాయణ, శేషయ్య, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

యానాది కాలనీలో కొత్త ఇళ్లు నిర్మించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

చిలమకూరు యానాది కాలనీలో కొత్త ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్ కోరారు. బుధవారం కాలనీని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ చాలా సంవత్సరాల క్రితం యానాదులు నిర్మించుకున్న మట్టి మిద్దెలు భారీ వర్షాల కారణంగా ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. అప్పుడో ఇప్పుడో కూలిపోయే విధంగా ఉన్నాయని తెలిపారు. వారు ఆర్థికంగా చాలా వెనుకబడ్డారని, ప్రభుత్వం వారికి సబ్సిడీ రుణాలు మంజూరు చేయించి,ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కాలనీకి సంబంధించిన ప్రభుత్వ భూమి రెండున్నర ఎకరాను పక్కనున్న భూ యజమానులు ఆక్రమించుకున్నారని తెలిపారు. విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి పదేపదే తీసుకెళ్లినా వారు పట్టించుకోవడంలేదని విమర్శించారు. అనంతరం యానాది కాలనీ వాసులతో కలిసి సీనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో తిరుమలయ్య పాల్గొన్నారు.



సీనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మికి వినతిపత్రమిస్తున్న అన్వేష్



సోమపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వంక

ఉప్పొంగి ప్రవహిస్తున్న వంకలు, నదులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని వాగులు, వంకలు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. రెండు రోజులుగా మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలకు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గుంత చియ్యపాడు వద్ద వంకపై నీరు ప్రవహిస్తోంది. సోమాపురం, నెర్రవాడ గ్రామాల మధ్యలో ఉన్న వంక ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బ్రిడ్జి మునిగింది. చాపాడు సమీపంలో ఉన్న గుండ్ల వంక కూడా తీవ్ర స్థాయిలో ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో పడిన వర్షానికి కుందూ నది తీవ్రంగా పారుతోంది. అన్నవరం, అల్లాడుపల్లె వద్ద పాత బ్రిడ్జిలు పూర్తిగా మునిగిపోయాయి. నదిలో 40 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. మైలవరం జలాశయం నుండి నీరు కిందికి వదలడంతో పెన్నా నదిలో నీటి ప్రవాహం పెరిగింది. నదీ తీర గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ రమాకుమారి సూచించారు. బ్రిడ్జిల వద్ద ఎవరిని నీటిలో దిగకుండా సిబ్బందిని అప్రమత్తం చేశారు.



సంతకాల సేకరణలో మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

కూటమి ప్రభుత్వంలో పేద ప్రజలకు విద్య, వైద్యం దూరం చేసే ప్రయత్నం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. దీన్ని నిరసిస్తూ మండల పరిధిలోని మొర్రాయపల్లెలో బుధవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. మండల పరిధిలో పదివేల మందితో సంతకాలు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్షుమయ్య, వైసీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు ఎస్ఆర్ బాల నరసింహారెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీనివాసుల రెడ్డి, మాజీ సర్పంచ్ రామాంజనేయులురెడ్డి, నాయకులు సివి సుబ్బారెడ్డి, మహేష్ యాదవ్, జయరామిరెడ్డి, వెంకటరెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఓబుళరెడ్డి, మహేష్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, రామలింగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలి : మండల పరిధిలోని ఆనందాశ్రమం-మొర్రాయపల్లె రోడ్డు వద్ద ప్రజలు మైదుకూరుకు వెళ్లేందుకు చాలా అవస్థలు పడుతున్నారని, వెంటనే సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఆనందాశ్రమం రోడ్డు వద్ద నెల్లూరు-బళ్లారి హైవేను పరిశీలించారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ హైవే నిర్మాణంలో భాగంగా మొర్రాయపల్లె గ్రామం వద్ద ప్రజలకు ఇబ్బందికరంగా తయారైందన్నారు. మైదుకూరు, ప్రొద్దుటూరు వెళ్లాలంటే చాలా ప్రమాదకరంగా ఉందన్నారు. సురక్షిత ప్రయాణానికి సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలన్నారు. సంబంధిత అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.

వైసిపి నాయకుల కోటి సంతకాల సేకరణ

సింహాద్రిపురం : మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి విశేషస్పందన లభిస్తోందని ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వై.కొత్తపల్లిలో బుధవారం రచ్చబండ, కోటి సంతకాల సేకరణ నిర్వ హించారు. మెడికల్ కళాశాలలను ప్రయి వేటీకరణ చేయడం వల్ల పేద ప్రజలు చాలా ఇబ్బందులు పడతారన్నారు. మం డల వ్యాప్తంగా పదివేల మందితో సంతకాలు చేయాలనే లక్ష్యం పెట్టుకు న్నామ న్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకతతో ప్రజలు స్వచ్ఛందంగా సంతకాలు చేస్తున్నారని తెలిపారు. మాజీ నెట్ క్యాప్ డైరెక్టర్ కిషోర్‌రెడ్డి, పార్టీ నాయకులు విజయ భాస్కర్ రెడ్డి, లోమడ రుషికేశవరెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లె : పేదల ఆరోగ్యం, పేద విద్యార్థుల ఉన్నత చదువులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్లక్ష్యం వహిస్తున్నారని, అందుకే ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయి వేటీకరణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని జడ్పిటిసి రవి కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి విమర్శించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపుమేరకు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయి వేటీకరణను వ్యతిరేకిస్తూ, ప్రజా మద్దతు కోరుతూ 1,4,5,6, వార్డులలో కోటి సంతకాల సేకరణ బుధవారం నిర్వహించారు. వైసీపీ మండల ఉపాధ్యక్షులు మునీర్ బాషా, రవిశంకర్ గౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వేణుగోపాల్, వైసీపీ జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి కటిక చంద్రశేఖర్, రాష్ట్ర ప్రచార సంయుక్త కార్యదర్శి నిసార్ బాషా, ఎంపీటీసీలు నాగన్న, మణిగోపాల్‌రెడ్డి, వార్డు మెంబర్ బాబయ్య, గణేష్, షాదిఖానా మాజీ చైర్మన్ బిఎస్ షేక్షావలి, నాయకులు సింగారెడ్డి రామచంద్ర, కమతం రాజా, మధు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



మాట్లాడుతున్న ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్

ఆస్తి పంచివ్వనందుకే జంట హత్యలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఆస్తిని పంచివ్వనందుకే తన తండ్రి కుడేటి నాగప్పతోపాటు సహజీవనం చేస్తున్న తలారి పాముల పెద్దక్కను కుడేటి చిన్న వెంకటేష్ హత్య చేసినట్లు ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 25న రాత్రి మోరగుడి పిహెచ్‌సి సమీపంలో ఉన్న ఇటుకల బట్టీ వద్ద జంట హత్యలు జరిగిన విషయం తెలిసిందేనన్నారు. హత్యలపై కుడేటి పెద్ద వెంకటేష్ ఫిర్యాదు మేరకు అర్బన్ సిఐ నరేష్‌బాబు కేసు నమోదు చేశారన్నారు. చిన్న వెంకటేష్‌ను బుధవారం విచారించి అరెస్టు చేశారన్నారు. నిందితుడ్ని అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన ఇన్‌స్పెక్టర్ పి.నరేష్‌బాబు, ఎస్‌ఐలు బి.రామక్రిష్ణ, పి.హైమవతి, కానిస్టేబుళ్లు నాగేంద్ర, కృష్ణారెడ్డి, మహేష్, గంగాధర్, సుధాకర్, సురేష్, ప్రవీణ్‌ను ఎస్‌పి అభినందించారు. సమావేశంలో జమ్మలమడుగు డిఎస్‌పి వెంకటేశ్వర్లు ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - లింగాల

మండలంలోని దొండ్లవాగు గ్రామంలో బుధవారం ఇంట్లో కరెంట్ బోర్డు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై గొడలి వెంకటరాములు (60) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే చనిపోయాడని తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.